సౌమ్యనాథుని సన్నిధిలో జడ్జి

నందలూరు : అన్ని దానాల్లో కెల్లా అన్నదానం గొప్పదని కడప అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి పేర్కొన్నారు. శనివారం శ్రీ సౌమ్యనాథ సేవా ట్రస్టు వారు నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని వారు సందర్శించి అన్న ప్రసాదాలను స్వీకరించి భక్తులకు రుచికరమైన భోజనం అందించిన సభ్యులను అభినందించారు. అనంతరం జడ్జిని ట్రస్టు కార్యదర్శి కె.శైలేంద్రనాథ్, కోశాధికారి చక్రాల రామసుబ్బన్నలు సన్మానించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు

వీరబల్లి : మట్లి ఎల్లంపల్లి కూడలి వద్ద స్థానిక ఎస్ఐ మోహన్ నాయక్ శనివారం సాయంకాలం వాహనాల తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు. రామాపురం మండలం రాచపల్లి గ్రామ పంచాయతీ దిగువ ఉప్పరపల్లికి చెందిన టీకూరు వెంకటేష్ అనే వ్యక్తి మద్యం సేవించి ద్విచక్ర వాహనం నడుపుతుండగా గమనించి వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా మద్యం సేవించి ఉన్నాడని గుర్తించారు. దీంతో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరుస్తున్నట్లు వారు తెలిపారు.

షార్‌లో డిప్యూటీ డైరెక్టర్‌గా పెనగలూరు వాసి


గోపీకృష్ణ, డిప్యూటీ డైరెక్టర్, షార్

పెనగలూరు: అన్నమయ్య జిల్లా పెనగలూరు గ్రామానికి చెందిన గోపికృష్ణను శ్రీహరికోట రేంజ్ (షార్)లో మేనేజ్‌మెంట్ సిస్టమ్ ఏరియాలో డిప్యూటీ డైరెక్టర్‌గా నియమించినట్లు ఉత్తర్వులు అందాయి. డైరెక్టర్‌గా ఉన్న ఆయనకు పదోన్నతి కల్పించారు. పెనగలూరు గ్రామ పురోహితుడు, పదవీ విరమణ పొందిన తెలుగు ఉపాధ్యాయుడు సుబ్బనరసయ్య, సుబ్బలక్షుమ్మ దంపతుల కుమారుడైన గోపీకృష్ణ షార్‌లో ఉన్నత పదవి పొందినందుకు పెనగలూరు గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. త్వరలోనే గోపీకృష్ణకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు యువకులు తెలిపారు.

దోమల మందు తాగేస్తున్నారు!

- రాయచోటి మున్సిపాలిటీలో శానిటరీ అధికారుల అవినీతి పర్వం
- విజృంభిస్తున్న దోమలు
- అడిగే దిక్కులేక ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న వైనం


మున్సిపల్ కార్యాలయంలోని గదిలో భద్రంగా ఉన్న ఫాగింగ్ మిషన్లు

రాయచోటి : రాయచోటి మున్సిపాలిటీ పరిధిలో దోమల ఉత్పత్తి కోసం రోజుకు 10 లీటర్ల డీజిల్, 5 లీటర్ల పెట్రోల్, 60 మిల్లీ లీటర్ల మెలాసిస్‌ను ఉపయోగిస్తున్నారు. ఇదేంటి.. దోమల నిర్మూలనకు వినియోగించే ఇంధనాన్ని దోమల ఉత్పత్తి కోసం వినియోగిస్తున్నారని ఆశ్చర్యపోతున్నారా.. అయితే మీరు ఒకసారి రాయచోటి పురవీధుల్లో సాయంత్రం వేళ తిరగండి.. మనుషుల రక్తం పీల్చుకుని తాగే దోమలను చూస్తే మీకే అర్థమవుతుంది.. మరింత నమ్మకం కోసం మున్సిపాలిటీలో శానిటరీ అధికారులు ఫాగింగ్ మిషన్లతో వినియోగిస్తున్న డీజిల్, పెట్రోల్ వివరాలు నమోదు చేసే రికార్డులను పరిశీలించండి.. అప్పుడు మీకు నమ్మకం కుదురుతుంది. ఫాగింగ్‌కు వినియోగించాల్సిన యంత్రాలు మున్సిపల్ కార్యాలయంలోని ప్రత్యేక గదిలో భద్రంగా ఉన్నాయి. వాటిని వినియోగిస్తే ఎక్కడ మరమ్మతులకు లోనై మున్సిపాలిటీ ఆర్థిక ఇబ్బందుల్లో పడిపోతుందోననే భయం అధికారుల్లో ఉన్నట్లుంది. ఫలితంగా దోమల నియంత్రణకు ఉపయోగించాల్సిన యంత్రాలు మూలనపడి మూలుగుతున్నాయి. అయితే వాటిని ప్రతిరోజు వినియోగిస్తున్నట్లు, వాటి ద్వారా రోజుకు 10 లీటర్ల డీజిల్, ఐదు లీటర్ల పెట్రోల్, 60 మిల్లీ గ్రాముల మెలాసిన్ ఆయిల్‌ను ఖర్చు చేస్తున్నట్లు రికార్డుల్లో నమోదు చేస్తున్నారు. అంటే రాయచోటి మున్సిపాలిటీ పరిధిలో ఫాగింగ్ నిర్వహణకు రోజుకు రూ.1550, నెలకు రూ.46,500, ఏడాదికి రూ.5,58,000 వంతున ఖర్చు చేస్తున్నట్లు శానిటరీ అధికారులు నిధులు డ్రా చేస్తున్నారు. ఇందులో ఎలాంటి తప్పు లేదు.. ఫాగింగ్ చేయకుండానే నిధులు డ్రా చేయడంలోనే అధికారుల మతలబు దాగి ఉంది. ఫాగింగ్ చేయకుండానే చేసినట్లు రికార్డులు చూపి నెల నెల నిధులను డ్రా చేస్తున్నారు. స్థానికంగా పనిచేస్తున్న శానిటరీ అధికారిని పక్కన పెట్టి ఆయన స్థానంలో సచివాలయంలో పని చేస్తున్న శానిటరీ సెక్రటరీ రామమోహన్‌రెడ్డికి మున్సిపల్ పరిధి బాధ్యతలు అప్పగించారు. దీంతో శానిటరీ సెక్రటరీ ఆధ్వర్యంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలలో ఫాగింగ్ అవినీతి ఒకటిగా ప్రచారం జరుగుతోంది.

స్వైర విహారం చేస్తున్న దోమలు

సాయంత్రం 6 గంటలు అయిందంటే చాలు రాయచోటి మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడ చూసినా దోమలు స్వైర విహారం చేస్తుంటాయి. వారు వీరు అని చూడకుండా అందరి రక్తాన్ని పీల్చుతుంటాయి. వాటి నివారణలో భాగంగా చేపట్టాల్సిన నాలుగు ఫాగింగ్ యంత్రాలు మున్సిపల్ కార్యాలయంలోని ప్రత్యేక గదిలో భద్రంగా ఉన్నాయి. వాటిని ఎక్కడా వినియోగించిన పాపాన పోలేదు. అధికారులు మాత్రం వాటిని రోజూ వినియోగిస్తున్నట్లు రికార్డుల్లో నమోదు చేస్తూ ప్రజా ధనాన్ని నొక్కేస్తున్నారనే విమర్శలున్నాయి.

అడిగేవారెవరు?

పురపాలక పాలకవర్గం మిన్నకుండి పోతోంది.. పర్యవేక్షించాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారు. ఫలితంగా రాయచోటి మున్సిపాలిటీలోని ఏ విభాగంలోకి తొంగి చూసినా అవినీతి అక్రమాలు కనిపిస్తున్నాయి. పాలకవర్గంలో వైఎస్సార్‌సీపీకి చెందిన వారు ఉన్నారు. స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి ప్రస్తుత అధికార పార్టీ నేత కావడంతో మున్సిపాలిటీ అధికారుల అవినీతికి రొట్టె విరిగి నేతిలో పడ్డ చందంగా తయారైంది. అందులో శానిటరీ విభాగం ఒక్కటిగా చెబుతారు.

ఫాగింగ్ చేస్తున్నాం

కలెక్టర్, జేసీ, ఎస్పీ బంగ్లాలు, కోర్టులు, న్యాయమూర్తులు, మంత్రి ఇంటి పరిసర ప్రాంతాలలో ప్రతి రోజు ఫాగింగ్ చేస్తామని శానిటరీ ఇన్‌చార్జి అధికారి రామమోహన్‌రెడ్డి చెప్పారు. ప్రజలు ఎవరైనా అడిగితే వారి ఇళ్ల పరిసర ప్రాంతాల్లో కూడా ఫాగింగ్ చేస్తామని చెప్పారు. ఇదీ.. శానిటరీ అధికారి విధి నిర్వహణకు.. ప్రజారోగ్యానికి చక్కని ఉదాహరణ.

రెండు కార్లు ఢీ


జాతీయ రహదారిపై ఢీ కొన్న కార్లు

ఓబులవారిపల్లె : చిన్నఓరంపాడు డాబా హోటల్ సమీపంలో శనివారం ఎదురెదురుగా వస్తున్న రెండు కార్లు ఢీ కొన్నాయి. ప్రమాదంలో కార్లకు ముందుభాగం బాగా దెబ్బతింది. అందులో ప్రయాణిస్తున్న నలుగురికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని 108లో రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.మహేష్ తెలిపారు.

అంగన్‌వాడీ టీచర్ ఆత్మహత్యాయత్నం


ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన లావణ్య

రామసముద్రం : రామసముద్రం మండలం మాలే నత్తం పంచాయతీ కొండూరు గ్రామంలో అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న లావణ్య (32) ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బాధితురాలి కథనం మేరకు.. అంగన్‌వాడీ సూపర్ వైజర్ చంద్రకాంతమ్మ ప్రతి చిన్న విషయానికి తనను వేధిస్తోందని, పలు మార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఆమెపై చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వేధింపులు తాళలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ఆమె తెలిపారు.

సూపర్‌వైజర్‌ను సస్పెండ్ చేయాలి

రాయచోటి అర్బన్ : అంగన్‌వాడీ వర్కర్ లావణ్యను వేధింపులకు గురిచేసిన ఆ సెక్టార్ సూపర్‌వైజర్ చంద్రకాంతమ్మను వెంటనే సస్పెండ్ చేయాలని సీఐటీయూ అనుబంధ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భాగ్యలక్ష్మి డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం రాయచోటి ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ వర్కర్లు నిరసన తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కోశాధికారి బంగారుపాప, ప్రాజెక్టు అధ్యక్షురాలు సిద్దమ్మ, అరుణ, సుమలత, సురేఖ, భూదేవి, అనిత తదితరులు పాల్గొన్నారు.

పూర్తయిన రేషన్ డీలర్ల నియామక ప్రక్రియ

రాజంపేట : రాజంపేట డివిజన్‌లో ఖాళీగా ఉన్న చౌక దుకాణాల డీలర్ల నియామక ప్రక్రియను పూర్తి చేసినట్టు రాజంపేట సబ్‌కలెక్టర్ వైకోమ్ నైదియా దేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పారదర్శకంగా డీలర్లను ఎంపిక చేసినట్టు ఆమె పేర్కొన్నారు.

నియమించబడిన డీలర్లు వీరే...

కుమ్మరపల్లె(చిట్వేలి) మన్నూరు మల్లికార్జునరెడ్డి, నందలూరు మండలం ఆడపూరుకు చంద్రకళ, నల్లతిమ్మాయపల్లెకు వై.గౌరి, చెన్నయగారిపల్లెకు కె.సాయి, టీవీపురానికి దొమ్మరాజు బృందమ్మ, న్యూతిమ్మరాచపల్లెకు మీసాల మహిమకుమారి, ఓబువారిపల్లె మండలంలో జీవీపురానికి చిన్నరెడ్డయ్య, చిన్నమరాజుపోడుకు సూర్యతేజ, చిన్నంపల్లెకు స్వాతిలు ఎంపికైయ్యారు. పెనగలూరు మండలంలో ఎస్ఆర్‌పురానికి సాయికృష్ణ, దిగువ సిద్దవరానికి వెలగచర్ల సిసింద్రీ, పుల్లంపేట మండలంలో పుల్లంపేట-1కు కుమారస్వామి, రాజంపేట పట్టణంలో బలిజపల్లెకు పెమ్మనబోయిన వనజ, మన్నూరుకు రొంపిచెర్ల మానస, రూరల్ పరిధిలో మందరం గ్రామానికి తిప్పన నరేష్, కారంపల్లె-1కు సూరపురాజు దీప, ఎంజీపురం గ్రామానికి గాడిరాజు శ్రీలత, హెచ్‌చెర్లపల్లెకు దొమ్మరాజు సాయికుమార్, రైల్వేకోడూరులో ఇమామ్‌సాహెబ్ వీధికి శివయ్య, కేఆర్ కండ్రికకు చమర్తి వెందమ్మ, అనంతరాజంపేటకు పి.ప్రసాద్, టి.సుండుపల్లె మండలంలో గుంతరాచపల్లె పొలిమేరపల్లెకు రవీంద్ర, సిద్దారెడ్డిగారిపల్లెకు అబ్దుల్ రహీం, వానరాచపల్లెకు జగదీష్, జీకేరాచపల్లెకు కత్తి నిఖిత, జంగాలపల్లెకు నవీన్‌నాయక్, రాయవరంకు ఫరూక్ అబ్దుల్లా, సందానాయక్‌బిడికికి రేణుక, కొనంకివాండ్లపల్లెకు వీఆర్‌నాయుడు, వీరబల్లి మండలంలో గుర్రప్పగారిపల్లెకు రాఘవరాజు శివసాయి, చంద్రశేఖర్, మట్లికి అశ్విని, తాటిగుంటపల్లెకు మహమ్మద్ అక్, సానిపాయికి కమల, పెద్దవీడుకు ప్రసన్న, మేకల మానస, సోమారం గ్రామానికి వరలక్ష్మీ, వంగిమళ్లకు జయభారత్‌రెడ్డి, గడికోటకు కౌసల్య, వర్ధిని, తాటిగుంటపల్లెకు లోకేశ్వరి, ఓబులవారిపల్లె మండలంలో కాపుపల్లెకు రెడ్డిపాక లక్ష్మీదేవి, బి.కమ్మపల్లెకు నవీన్‌కుమార్, రాజంపేట మండలంలో అన్నమయ్యనగర్‌కు పందికాళ్ల సౌమ్య, సిద్దులపల్లెకు రాజేంద్రప్రసాద్, ఎస్.ఎర్రబల్లికి గోళ్ల పుష్పలత, రైల్వేకోడూరులో మార్కెట్ స్ట్రీట్‌కు తొండమ్మ కోమల, చింతనగర్‌కు షేక్ జుబీర్‌లు నియమితులయ్యారు.

ఆలయానికి విరాళం

చిట్వేలి: శ్యామలాంబ సమేత సోమేశ్వర ఆలయానికి రిటైర్డ్ ఐఆర్ఎస్ డిప్యూటీ కమిషనర్ రామతోటి కనకాద్రి, ఆయన సతీమణి నిర్మల, కుమారుడు రాజేంద్రప్రసాద్, కోడలు గీత కుటుంబ సభ్యులు రూ. 2 లక్షలు విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో బి.నాగేశ్వరరావు, అర్చకుడు పవన్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారానికి చొరవచూపాలి


సుండుపల్లె: అర్జీలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్


చిన్నమండెం: అర్జీలను స్వీకరిస్తున్న అధికారులు

పుల్లంపేట : మండల పరిధిలోని తిప్పాయిపల్లిలో శనివారం జరిగిన రెవెన్యూ సదస్సును రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నదియా దేవి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు ప్రతి అధికారి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అరవింద కిషోర్, ఆర్ఐ సుశీల్ కుమార్, వీఆర్ఓ ఆరీఫ్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సుండుపల్లె : మండల పరిధిలోని భాగంపల్లి గ్రామ సచివాలయంలో గ్రామ రెవెన్యూ సదస్సును మండల ప్రత్యేక నోడల్ అధికారి జయరాముడు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ దైవాదీనం మాట్లాడుతూ ప్రజలకు ఉన్నటువంటి సమస్యలను అర్జీల రూపంలో తెలియజేస్తే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామసభలో 54 అర్జీలు వచ్చాయని వారన్నారు.

చిన్నమండెం : మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామ సచివాలయంలో శనివారం రెవెన్యూ సదస్సులను నిర్వహించినట్లు తహసీల్దార్ నరసింహులు తెలిపారు. ముఖ్య అతిథిగా హాజరైన మండల ప్రత్యేకాధికారి చంద్రానాయక్ ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా 36 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాల్లో అభివృద్ధి పనుల అవినీతిపై విజిలెన్స్ విచారణ

ఒంటిమిట్ట : ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని పలు ఆలయాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల్లో జరిగిన అవినీతిపై విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. వెంకటేశ్వర్లు అనే వ్యక్తి చేసిన ఫిర్యాదు మేరకు ఒంటిమిట్ట కోదండరామాలయంలో అభివృద్ధి పనుల్లో భాగంగా మిగిలిపోయిన ఇనుప రేకులు, ఇనుప వస్తువులు, ఇతర సామాన్లు మాయమైన సంఘటనపై టీటీడీ విజిలెన్స్ ఎస్ఐ విష్ణువర్ధన్ శనివారం విచారణ జరిపారు. అలాగే నందలూరు సౌమ్యనాథ స్వామి ఆలయం, తాళ్లపాక, దేవుని కడపలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో కూడా పనులు చేయకుండానే బిల్లులు తీసుకున్నారనే ఫిర్యాదుపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. సౌమ్యనాథస్వామి ఆలయ ధ్వజ స్థంభం మార్పిడి చేయకుండా మార్చినట్లుగా బిల్లులు చెల్లించారని, క్షేత్రస్థాయిలో నిర్ధారణకు వచ్చారు. రామాలయంలో ఇనుప వస్తువులను ఇంజినీరింగ్ అధికారులు తరలించారని అప్పటి కాంట్రాక్టర్లు, అధికారులను విచారించారు. తుది నివేదికను టీటీడీ విజిలెన్స్ అధికారులకు అందజేస్తానని ఎస్ఐ తెలిపారు.

నిధులు నీళ్లపాలు..!

- కన్యకల చెరువు తట్టులో పార్కు ఏర్పాటు
- పనులు చక చకా.. చెరువునిండటంతో మునక


నందలూరు కన్యల చెరువు నిండటంతో మునిగిపోయిన నిర్మాణంలోని రూరల్ అర్బన్‌మిషన్ పార్కు

రాజంపేట: నందలూరులో శ్యాంప్రసాద్ ముఖర్జీ రూరల్ అర్బన్ మిషన్(కేంద్రప్రభుత్వం) నిధులు నీళ్లపాలయ్యాయి. శనివారం కన్యకల చెరువు తొట్టి ప్రాంతంలో రూరల్ అర్బన్ మిషన్ నిధులు రూ.50లక్షలతో నిర్మించిన పార్కు ప్రాంతం నీటిమయంగా మారిపోయింది. గత ఏడాది జూన్ 25 ఏపీ రాష్ట్ర గ్రామీణ నీటిపారుదల సంస్థ టెండర్లను పిలిచింది. ఈ టెండర్లను కూటమినేత ఒకరు దక్కించుకున్నారు. ఆయన పార్కు నిర్మాణ పనులు చేస్తున్నారు. గతంలో ఇదే చెరువు తొట్టి ప్రదేశంలో(తోట పాళెంవైపు) ప్రజావైద్యం కోసం 30 పడకల ఆసుపత్రి నిర్మించాలని స్థానిక ప్రజాప్రతినిధులు కలెక్టర్ హరికిరణ్‌ను కలిసి కోరితే, అది చెరువుతొట్టి ప్రాంతం.. అక్కడ ఎలా నిర్మిస్తామని స్థానిక నేతలను కలెక్టరు ప్రశ్నించిన సంగతి తెలిసిందే. అటువంటప్పుడు చెరువు తొట్టి ప్రాంతంలో పార్కు నించాలని తలంపు ఏపీఆర్ఐసీ అధికారులు ఎందుకు వచ్చింది? టెండర్లు ఎలా పిలిచారని విమర్శలు వెలువడుతున్నాయి. మండల కేంద్రానికి రెండు కిలోమీటర దూరంలో పార్కు నిర్మిస్తే ఎవరికి ఉపయోగమనేది అధికారులకే తెలియాలి. ఇందుకు రూరల్ అర్బన్ మిషన్ నిధులు ఉపయోగించి, నీళ్ల పాలు చేయడంపై కాషాయనేతల్లో ఆందోళన .పెచ్చరిల్లుతోంది. గతంలో కూడా స్థలం సరిపోదని, పార్కు నిర్మిస్తే నీళ్లు వస్తాయనే తెలుసుకొని ఈ విషయంలో వెనకడుగువేశారు.నందలూరు కన్యకల చెరువ ప్రాంతంలో పార్కు నిర్మించరాదని గతంలో నీటి పారుదల అభ్యంతరం వ్యక్తంచేసినట్లు తెలిసింది. ఇరిగేషన్ అభ్యంతరాలను లెక్కచేయకుండా ఏపీఆర్ఐసీ టెండర్లను పిలచడం సర్వత్రా విమర్శలకు దారితీస్తోంది.

పార్కు మునిగిందిలా..

నందలూరు కన్యలక చెరువు తొట్టి ప్రాంతంలో రూరల్ అర్బన్ మిషన్ నిధులతో నిర్మితమైన పార్కులోకి చెరువులో నీరు ప్రవేశించింది. కొద్దిరోజులు నందలూరు చెయ్యేరులో నీటి ప్రవాహాన్ని చెరువులోకి మళ్లించుకున్నారు. ఈ పనులు కన్యకల చెరువు నీటి సంఘం చేపట్టింది. ఇప్పుడు చెరువు అలుగులు పారుతోంది. చెరువులో పూర్తిస్థాయిలో నీరు చేరుకుంటే అక్కడ పార్కు నిర్మించినా వృథా అనేది జనంలో ప్రచారం జరుగుతోంది.

సంబంధిత అధికారులు మాత్రం చెరువుకు అత్యంత సమీపంలో నిర్మిస్తున్న పార్కు నీట మునగలేదని, అదొడే ఫిల్లర్‌లో నుంచి నీరు వస్తున్నాయని చెప్పుకుంటున్నట్లు తెలిసింది, ఇది చూసి జనం నవ్విపోతున్నారు. బహిరంగంగా కళ్లకు కనిపిస్తుంటే మునగలేదనే వాదనపై అనేక అనుమానాలు నందలూరు వాసుల్లో వినిపిస్తున్నాయి.

యథేచ్ఛగా అక్రమ ఇసుక రవాణా


టక్కోలు పెన్నానది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్

సిద్దవటం : మండలంలోని పెన్నానది నుంచి ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ప్రజల అవసరాలకు మాత్రమే ఉచిత ఇసుక పాలసీని అమలు చేసిందన్నారు. సిద్దవటం మండలంలోని టక్కోలు, మాచుపల్లె గ్రామాల సమీపంలోని పెన్నానది నుంచి ఇసుకను ట్రాక్టర్‌ల ద్వారా కడపకు తరలిస్తున్నారని, అక్కడ రూ. 4వేల నుంచి రూ. 5 వేల వరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని వారు పేర్కొంటున్నారు. అక్రమంగా ఇసుక తరలిపోతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వైభవంగా వేంకటేశ్వరుడి కల్యాణం


ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై కల్యాణ క్రతువును జరుపుతున్న వేదపండితులు

సుండుపల్లె : మండల కేంద్రంలోని విరూపాక్షేశ్వర స్వామి దేవాలయం (శివాలయం) ఆలయ ప్రాంగణంలో శనివారం శ్రీదేవి, భూదేవి శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని వేదపండితులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే స్వామివారికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక అలంకరించిన ఉత్సవ మూర్తులను కల్యాణ వేదికపై కొలువుదీర్చి మంత్రోచ్చరణల నడుమ వేడుకను కనుల పండువగా జరిపించారు. వేడుకలో మండల నలుమూలల నుంచి గోవింద మాలధారులు, ప్రజలు పాల్గొన్నారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం విగ్రహాలను సాంస్కృతిక కార్యక్రమాల నడుమ మండల కేంద్రంలో ఊరేగించారు.

అంధుల ఆరాధ్య దైవం బ్రెయిలీ

నందలూరు : అంధుల కోసం ఆరు చుక్కల లిపిని కనుగొన్న లూయీ బ్రెయిలీ ఆరాధ్య దైవమని పాటూరు పంచాయతీ నీటి సంఘం అధ్యక్షులు ఉమామహేశ్వర్ తెలిపారు. శనివారం లూయీ బ్రెయిలీ జన్మదినం సందర్భంగా ఇసుకపల్లి భవిత కేంద్రంలో అంతర్జాతీయ బ్రెయిలీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న తనంలోనే కళ్లు కోల్పోయిన బ్రెయిలీ అంధుల కోసం లిపిని కనుగొని వారిని అనేక రంగాలలో ముందుండే విధంగా మార్గదర్శకంగా నిలిచేందుకు కృషి చేసిన బ్రెయిలీ సేవలు కొనియాడారు. ఈ సందర్భంగా అంధ విద్యార్థులకు బ్రెయిలీ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సమ్మిళిత ఉపాధ్యాయులు రంగస్వామి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రాజంపేటలో బళ్లారి యువకునికి గాయాలు

రాజంపేట : రాజంపేట రైల్వేస్టేషన్‌లో శనివారం బళ్లారికి చెందిన మోహన్ రైలునుంచి జారిపడి గాయపడ్డాడు. రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌లో తిరుపతికి ప్రయాణిస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు కుదుపులతో రైలుకింద పడ్డాడు. గాయపడిన యువకుడిని 108లో ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు.

వలంటరీ వ్యవస్థను కొనసాగించాలి


కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న వలంటీర్లు

రాయచోటి (జగదాంబసెంటర్) : గతంలో ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన వాగ్దానం మేరకు ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వలంటరీ వ్యవస్థను కొనసాగించాలని శనివారం అన్నమయ్య జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఏఐవైఎఫ్ అనుబంధ యూనియన్ సంఘం ఆధ్వర్యంలో వలంటీర్లు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వలంటరీ వ్యవస్థను కొనసాగించి రూ.10 వేల జీతం అందజేయడమే కాకుండా వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. గత 8 నెలల నుంచి రావాల్సిన బకాయి జీతాలను కూడా చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చెన్నూరు వెంకటరామ, గంగయ్యయాదవ్, రెడ్డిశేఖర్, చిట్టెమ్మ, రాణి, పలువురు వలంటీర్లు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి


ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో బైఠాయించిన రాజుల కాలనీ వాసులు

రాయచోటి అర్బన్ : తాగునీటి సమస్యను పరిష్కరించాలంటూ శనివారం రాయచోటి మండలం చెన్నముక్కపల్లె గ్రామం రాజులకాలనీకి చెందిన ప్రజలు ఆందోళనకు దిగారు. పలువురు మైనార్టీ మహిళలు ఖాళీ బిందెలతో రాజులకాలనీలోని ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట రోడ్డుపై ధర్నా చేశారు. నెలల తరబడి తాగునీరందక ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. రహదారిపై వెళ్లే వాహనాలను అడ్డుకోవడంతో గ్రామసర్పంచ్ భర్త శ్రీనివాసులురెడ్డి ఆందోళనకారులతో చర్చించారు. పోలీసులు రంగప్రవేశం చేసిఆందోళనకారులను అక్కడి నుంచి బలవంతంగా పంపివేశారు. దీంతో వారు సీపీఐ రాయచోటి కార్యదర్శి శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట బైఠాయించారు. ఐదు రోజుల్లో తాగునీరందేలా చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ హామీ యివ్వడంతో సమస్య సద్దుమణిగింది.

ఉపాధ్యాయుడా.. రాజకీయ నాయకుడా.!



ముదుంపాడులో వెలిసిన ఫ్లెక్సీ

సుండుపల్లె : ముదుంపాడు గ్రామ పంచాయతీ, ముదుంపాడు కస్పాలోని ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణ నాయక్ నూతన సంవత్సర శుభాకాంక్షలతో వేసిన బ్యానర్ మండలంలో చర్చనీయాంశంగా మారింది. ఒక ప్రభుత్వ ఉపాధ్యాయుడు నరేంద్ర మోదీ, చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ ఫొటోలతో ఫ్లెక్సీ వేయడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఆయన ఉపాధ్యాయుడా లేక రాజకీయ నాయకుడా అని పలువురు మండల వాసులు విమర్శిస్తున్నారు.

దాడి ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు

సుండుపల్లె : మండల పరిధిలోని తిమ్మసముద్రం గ్రామం, బురుజుకాడ రెడ్డెరుపల్లికి చెందిన మర్రిపాటి నాగరాణి, ఆమె భర్త శివారెడ్డిపై అదే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు దాడి చేశారని స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. బురుజుకాడ రెడ్డెరుపల్లికి చెందిన మర్రిపాటి వంశీ కుమార్ రెడ్డి, పవన్ కుమార్ రెడ్డి కోళ్లను మర్రిపాటి నాగరాణి ఆమె భర్త శివారెడ్డి మందు పెట్టి చంపారనే ఉద్దేశంతో దాడి చేసి గాయపరిచినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈమేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

సత్కారం

నందలూరు : రైల్వే కార్మికుల న్యాయమైన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరింపజేయడంలో మజ్దూర్ యూనియన్ ముందుంటుందని గుంతకల్లు డివిజన్ అధ్యక్షుడు కామ్రేడ్ బీఎం బాషా తెలిపారు. శనివారం నందలూరుకు విచ్చేసిన ఆయనను, ఆయనతోపాటు చదువుకున్న చిన్ననాటి స్నేహితులు ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో అల్లం అశోక్ కుమార్, శ్రీధర్, బోనాసి నరసింహులు, మహమ్మద్, మేడా సూర్యనారాయణ రెడ్డి, నూరు, గులామ్, నాగరత్నం తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ డైరీ ఆవిష్కరణ

పుల్లంపేట : ఎస్టీయూ నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను స్థానిక మండల వనరుల కేంద్రం ఆవరణలో శనివారం ఎంఈఓలు జి.చక్రధర్ రాజు, డి.నాగతిరుమలరావులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు బి.నరేంద్రనాథ్, ప్రసాద్ రెడ్డి, సయ్యద్ సర్తాజ్ హుస్సేన్, వి.సిద్దయ్య, ఎం.శివరాం ప్రసాద్, గౌస్, అశోక్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీలో కోడూరు నాయకులు


పంజం సుకుమార్‌రెడ్డి


చెవ్వు శ్రీనివాసులురెడ్డి


దేపూరి చిన్నవెంగల్‌రెడ్డి


ముద్దలూరు సుబ్బరామరాజు


మాదినేని కనకరాజు


టంగుటూరు క్రిష్ణారెడ్డి


పాపినేని విశ్వనాథరెడ్డి

రైల్వేకోడూరు అర్బన్ : వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా కమిటీని శనివారం ప్రకటించారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధిగా పంజం సుకుమార్‌రెడ్డి, జిల్లా ఆర్గనైజర్, అడిషనల్ కో–ఆర్డినేటర్‌గా చెవ్వు శ్రీనివాసులురెడ్డి, కార్యదర్శిగా దేపూరి చిన్నవెంగల్‌రెడ్డిని, యాక్టివిటీ కార్యదర్శులుగా ముద్దలూరు సుబ్బరామరాజు, మాదినేని కనకరాజులను, ఉపాధ్యక్షులుగా టంగుటూరు క్రిష్ణారెడ్డిలను నియమించారు. ఈ సందర్భంగా కొరముట్ల మాట్లాడుతూ కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికి పార్టీలో ప్రాధాన్యం ఉంటుందని, పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేయాలన్నారు. జిల్లా కార్యవర్గంలో చోటు దక్కించుకున్న వారికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

జిల్లా అధికార ప్రతినిధిగా విశ్వనాథరెడ్డి

రాజంపేట : వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధిగా పాపినేని విశ్వనాథరెడ్డి (విస్సీ) నియమితులయ్యారు. పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ బలోపేతం కోసం సైనికుడిలా కృషిచేశారు. ఈ సందర్భంగా ఆయన శనివారం ఇక్కడి విలేకర్లతో మాట్లాడారు. పదవి రావడానికి సహకరించిన జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి, ఆకేపాటి సోదరుడు అనిల్‌రెడ్డిలకు కృతజ్ఞతలను తెలియజేశారు. కాగా మూడోసారి విశ్వనాథరెడ్డి ఈ పదవి పొందారు. ఆయన పట్ల డీసీఎంఎస్ మాజీ చైర్మన్ దండు గోపీ, జెడ్పీటీసీ దాసరి ప్రశాంతిలు హర్షం వ్యక్తం చేశారు.

ఆర్‌యూబీ పనులు పూర్తిచేయండి


పనులను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని రైల్వేస్టేషన్ వద్ద నిర్మిస్తున్న రైల్వే అండర్ బ్రిడ్జ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన నాయకులతో కలసి ఆర్‌యూబీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 33 గ్రామాలకు, వేల మంది విద్యార్థులకు ఇది ఎంతో ఉపయోగ పడుతుందని తెలిపారు. అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు సహకారంతో రూ.10.60 కోట్లు మంజూరు చేయించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో భరత్ కుమార్‌రెడ్డి, సర్పంచ్ చంద్రశేఖర్, సీహెచ్ రమేష్, మల్లికార్జున, కన్నయ్య, ఫరూక్ పాల్గొన్నారు.

విద్యతోనే మెరుగైన సమాజం

రాజంపేట టౌన్/నందలూరు : విద్యతోనే మెరుగైన సమాజం సాధ్యం కాగలదని ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఆ కళాశాల ప్రిన్సిపల్ ఎస్‌వీ రమణరాజుతో కలిసి ఇంటర్మీడియట్ విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. విద్యకు వైఎస్ఆర్, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాలు కృషి చేశాయన్నారు. పేదలు ఉన్నత చదువులతో బంగారు భవిష్యత్తు నిర్మించుకోవాలనే ఆశయంతో పథకాలను రూపొందించి చిరస్థాయిగా ప్రజల గుండెల్లో నిలిచిపోయారన్నారు. కాగా కూటమి ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడిచినా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించలేదని దుయ్యబట్టారు. వెంటనే కాలేజీలకు బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆయన నందలూరు మండలంలో పర్యటించారు. మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.


నందలూరు: విద్యార్థులకు ఆహారం వడ్డిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి

వీరబల్లి : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం మధ్యాహ్న భోజనాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తహసీల్దార్ శ్రావణి మాట్లాడుతూ ఈ పథకాన్ని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ అజంతుల్లా, ఎంఈఓ కృష్ణయ్య, సర్పంచ్ నాగార్జున ఆచారి, స్థానిక నాయకులు రెడ్డప్ప రెడ్డి, భానుగోపాల్ రాజు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లి : ఇంటర్మీడియట్ విద్యార్థులు మధ్యాహ్న భోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ–2 వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం శనివారం శ్రీకారం చుట్టిన మధ్యాహ్న భోజన పథకాన్ని స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో ఆయన ఇంటర్ విద్యార్థులకు భోజనం వడ్డించి ప్రారంభించారు.

వస్త్ర ప్రపంచ మణిహారం మన మాధవరం

- మగువలకు నచ్చే, మెచ్చే చీరల కేంద్రంగా ప్రసిద్ధి
- సంక్రాంతి సందడి మొదలైందంటున్న వస్త్ర దుకాణ యజమానులు


మగ్గం నేస్తున్న మాధవరం చేనేత కార్మికుడు


ప్రదర్శనకు ఉంచిన మాధవరం పట్టు చీరలు

సిద్దవటం : రాష్ట్ర వ్యాప్తంగా చేనేత, పట్టువస్త్రాలకు మాధవరం ఎంతో ప్రసిద్ధి. సిద్దవటం మండలంలోని కడప – చెన్నై ప్రధాన రహదారిలో ఈ గ్రామం ఉంటుంది. మహిళలు మెచ్చే చీర మాధవరం చీర అనే నానుడి కూడా ఉంది. నాణ్యత, నూతన డిజైన్, సరసమైన ధరలలో పట్టుచీరలను నేయడంలో మాధవరం చేనేత కళాకారులకు పెట్టింది పేరు. దీంతో మాధవరం చేనేతలకు ఒక ప్రత్యేక గుర్తింపు లభించింది. ఇక్కడికి వివిధ ప్రాంతాల నుంచి మహిళలు ఇక్కడి వచ్చి పట్టుచీరలు, చేనేత చీరలు, శిల్క్, బెనారస్ మొదలగు వస్త్రాలను కొనుగోలు చేస్తుంటారు. కాగా సంక్రాంతి పండుగ షాపింగ్ సందడి మాధవరంలో అప్పుడే కనిపిస్తోంది. తమకు నచ్చిన చీరలను తీసుకునే ఇంటికి వెళుతున్నామని మహిళలు పేర్కొంటున్నారు.


చేపూరి ఓబయ్య


అనంతరామయ్య


కనపర్తి సుబ్బారెడ్డి

నాణ్యతతో కూడిన చీరలకు నెలవు

అంతర్ రాష్ట్ర వస్త్ర వ్యాపార రంగంలో అన్ని చోట్ల మా ఉత్పత్తులు ఉన్నాయని, పెండ్లి పట్టుచీరల తయారీ మా ప్రత్యేకత అని శ్రీ సాయికృష్ణ హ్యాండ్లూమ్స్, జస్మిత హ్యాండ్లూమ్స్ అధినేత చేపూరి ఓబయ్య అన్నారు. 45 సంవత్సరాలకు పైగా వస్త్ర వ్యాపార రంగంలో నమ్మకం, నాణ్యత, సత్యం, నిర్మలత్వం అనే లక్ష్యాలతో మీద తమ సంస్థను నడుపుతున్నామని ఎం.వి.ఎస్.ఎక్స్‌క్లూజివ్ అధినేత ఎంవీఎస్ అనంతరామయ్య, శ్రీ సాయి ఈశ్వర్ శిల్క్ అధినేత మేరువ ఈశ్వరయ్యలు పేర్కొన్నారు. సరసమైన ధరలతో మహిళామణులకు నాణ్యత కూడిన చీరలను అందిస్తున్నామని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర హ్యాండ్లూమ్స్ అధినేత మేరువ హరికృష్ణ, అన్నమయ్య హ్యాండ్లూమ్స్ అధినేత కనపర్తి సుబ్బారెడ్డిలు తెలిపారు. అంతేగాకుండా మాధవరంలో నర్సరీ నుంచి ఉన్నత పాఠశాలల వరకు ఎంతో క్రమశిక్షణతో కూడిన విద్యను గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు అందిస్తున్నాయి. 10 పరీక్షల్లో కొన్ని సవంత్సరాలుగా సిద్దవటం మండలం టాపర్‌గా మాధవరంలోని హ్యాపీకిడ్స్ హైస్కూల్ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధిస్తూ విజయపరంపర కొనసాగిస్తోంది. నాగార్జున ప్రైమరీ స్కూల్ క్రమశిక్షణకు మారుపేరుగా నిలుస్తూ వస్తోంది. వైద్యపరంగా మాధవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందిస్తున్నారు.